క్లుప్తంగా

డీఐపీఆర్వోగా దాసరి నాగార్జున్



కాకినాడ సిటీ: జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్వో)గా దాసరి నాగార్జున్ నియమితులయ్యారు. ఈయన శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు సహాయ సంచాలకుడిగా పశ్చిమగోదావరి జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పని చేసిన ఆయనకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నాగార్జున్ శుక్రవారం స్థానిక డీఐపీఆర్వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పారదర్శకంగా బదిలీలు

బోట్‌క్లబ్: జిల్లా దేవదాయశాఖలో పరిధిలో పని చేసే ఈఓ, ఆలయ సిబ్బందిని ప్రభుత్వ నిబంధనలకు లోబడి బదిలీ చేయనున్నట్టు జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి అన్నారు. జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ శాఖలో పనిచేసే ఉద్యోగులకు ఈ నెల 23 నుంచి 31 వరకూ బదిలీలు చేసుకునేందుకు అవకాశం ఇచ్చిందన్నారు. ఒకే చోట ఐదేళ్లగా పనిచేసిన వ్యక్తిని తప్పనిసరిగా బదిలీ చేయడం జరుగుతుందన్నారు. 2 నుంచి 5 ఏళ్లు దాటిన ఉద్యోగులకు వారి కోరిక మేరకు బదిలీ చేయనున్నట్టు తెలిపారు. ఉద్యోగులకు మూడు ఆప్షన్లు ఇవ్వనున్నామని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న కమాండెంట్ విజయరావు దంపతులు

కాకినాడ రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చదవాలని మూడో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావు కోరారు. ఏపీఎస్పీ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పదో తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ, వేసవి శిబిరం ముగింపు వేడుకను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న కమాండెంట్ దంపతులు టిస్ట్ మెరిట్ విద్యార్థులను అభినందించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, అసిస్టెంట్ కమాంటెంట్లు సత్యం, రవి, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసరు రఘుబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి

కాకినాడ రూరల్: అవినీతి ఆరోపణలపై ఇటీవల విధుల నుంచి తొలగించిన వీఓఏలు పది మందిలో నలుగురిని విధుల్లోకి తీసుకోవాలని రమణయ్యపేటలోని డీఎల్‌డీఓ కార్యాలయంలో మండల సమాఖ్య, గ్రామ సంఘాల ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య కార్యదర్శి కృష్ణవేణి, రమణయ్యపేట వీఓఏ రమాదేవి, గ్రామ సంఘాలకు చెందిన సాయికుమారి, సత్య మాట్లాడుతూ ఓకే గ్రూపులో ముగ్గురు సభ్యులు ఉండడంతో రమణయ్యపేట, గైగోలుపాడు, వలసపాకలకు చెందిన వీఓఏలను తొలగించారని, వీరితో పాటు తొలగింపునకు గురైన వాకలపూడి(ఎఫ్) వీఓఏను విధుల్లోకి చేర్చుకోవాలని తీర్మానం చేశాయి. మండల సమాఖ్యలోను ప్రతిపాదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాకలపూడి గ్రామ సంఘం అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి భాను, గైగోలుపాడు గ్రామ సంఘ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి మంగా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

బాలాజీచెరువు: దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న జగన్నాథపురానికి చెందిన నిరుపేద మహిళలకు గురువారం అలయన్స్ క్లబ్ నిత్యావసర వస్తువులు అందజేసింది. కాకినాడలోని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సేవాశక్తి అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు వాటిని అందజేశారు. రెండు నెలలకు సరిపడ నిత్యావసర వస్తువులతో పాటు నగదు అందజేశారు. క్లబ్ సభ్యులు దుర్గా సుభద్ర, వసుం ఉపేంద్ర, మాలతి పాల్గొన్నారు.

వ్యక్తి నుంచి స్వర్ణాభరణాల స్వాధీనం



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్సై లోవరాజు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విలువైన బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపిన వివరాల మేరకు కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన విల్లూరి శివసాయి ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడు. అతని నుంచి 24 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసు, 32 గ్రాముల తాళిబొట్టు, రెండు సెల్ ఫోన్లు లభించాయని, వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని విజయవాడ కోర్టుకు హాజరు పరచి అనంతరం రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

కౌలు రైతుకు పట్టాభిషేకం

- ఖరీఫ్‌కు ముందే సాగు హక్కు పత్రాల పంపిణీ
- గ్రామాల్లో జోరుగా లబ్ధిదారుల ఎంపిక
- నెలాఖరులోగా కార్డులు ఇచ్చేలా ఏర్పాట్లు



సర్పవరంలో సీసీఆర్సీ కార్డులు అందుకున్న కౌలు రైతులు

కాకినాడ రూరల్: నేల తల్లిని నమ్ముకుని పంటలు సాగు చేసుకునే కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తోంది. వ్యవసాయ శాఖ ద్వారా అవసరమైన రాయితీలు పొందేందుకు పంట సాగు హక్కు పత్రాలను ప్రభుత్వం (సీసీఆర్సీ) అందిస్తోంది. రైతులు మాదిరిగా కౌలు రైతులకు సీఎం జగన్ గుర్తింపు ఇచ్చి పంటల సాగుకు రాయితీల పట్టాభిషేకం చేస్తున్నారు. 2019 నుంచి నాలుగేళ్లగా 11 నెలల కాల పరిమితితో ఏటా కౌలు రైతులకు ప్రత్యేక సదస్సుల ద్వారా గుర్తింపు కార్డులను అందజేస్తోంది. కౌలుకు సాగు చేపట్టే రైతులు వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో పాటు పంట సాగుకు ఆర్థికంగా చేయూతనిచ్చేలా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.13, 500 చొప్పున సహకారం, పండించిన పంటను ఆర్బీకేల ద్వారా గిట్టుబాటు ధరలకు విక్రయించేందుకు వీలుగా పంట సాగు హక్కు పత్రాలు అందజేస్తోంది. గత ఏడాది నియోజకవర్గంలో రెండు మండలాల్లో కలిపి 3750 మంది కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను అందించారు. 11 నెలల కాల పరిమితి ముగిసిన వారు రెన్యువల్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ వ్యవసాయ సీజన్‌కు సమయం దగ్గర పడుతుండడంతో ఖరీఫ్ ప్రారంభం నాటికి కౌలు రైతులను ఆదుకునేందుకు మే నెలాఖరులోనే గుర్తింపు కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు వీఆర్వో, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించి, కార్డులను పంపిణీ చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలలో కార్డులు జారీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికి 595 కార్డులు జారీ చేశారు. రైతులను ఒప్పించి కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు గత ఏడాది కంటే ఎక్కువగా అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

హక్కు పత్రాలతో అనేక ప్రయోజనాలు



గతంలో వ్యవసాయ భూముల పంటల సాగుకు కౌలు చేసినా కష్టమైనా నష్టమైనా భరించవల్సి వచ్చేది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి లేదు. పంట సాగు హక్కు పత్రాల ద్వారా తమకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో విత్తన, ఎరువుల రాయితీలతో పాటు గిట్టుబాటు ధరకు పంటను విక్రయిస్తున్నాం. పంట పెట్టుబడికి రైతు భరోసా ద్వారా సీఎం జగన్ ఆదుకుంటున్నారు. నేను 2.56 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– పీవీవీవీ సత్యనారాయణ, కౌలు రైతు, సర్పవరం

మే నెలాఖరులోగా గుర్తింపు కార్డులు



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌలు రైతులకు మే నెలాఖరులోగా పంట సాగు హక్కు పత్రాలు జారీ చేసేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. సదస్సుల్లో కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 11 నెలల కాల పరిమితిగా ఒక పంటకు మాత్రమే ఈ హక్కు పత్రం పనిచేస్తుంది. దీనిపై భూమి గల రైతులకు భయపడాల్సిన పనిలేదు. కౌలు రైతులను ప్రోత్సహించేందుకు వారికి అనుమతి ఇవ్వండి.

– సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి, కాకినాడ రూరల్

పార్కింగ్ కోసమే సెల్లార్లు

- ఏర్పాట్లు చేయకుంటే చర్యలు తప్పవు
- కమిషనర్ మహేష్‌కుమార్



కాకినాడ సిటీ: స్థానిక టూటౌన్ నుంచి జగన్నాథపురం బ్రిడ్జి వరకు భవన యజమానులు సెల్లార్‌లో పార్కింగ్ నిమిత్తం ప్లాను అనుమతి పొంది పార్కింగ్‌కు వినియోగించకుండా వ్యాపారాలు చేస్తున్న వారు తక్షణం సెల్లార్లను పార్కింగ్‌కు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.మహేష్‌కుమార్ కోరారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో భవన యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సెల్లార్‌లో పార్కింగ్‌కు ప్లాను అనుమతి పొంది వ్యాపారాలు చేస్తున్న 54 షాపింగ్ కాంప్లెక్స్‌లలో పార్కింగ్‌కు ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారో చెప్పాలని యజమానులను కోరారు. దీనిపై షాపు యజమానులు త్వరగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిటీ ప్లానర్‌ను కమిషనర్ ఆదేశించారు. షాపు యజమానులు మాట్లాడుతూ ఫుట్‌పాత్ నుంచి ర్యాంపు ఏర్పాటు చేస్తే సెల్లార్‌లో పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మెయిన్ రోడ్డులో ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానుల అనుమతితో పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మసీదు నుంచి గోల్డ్ మార్కెట్ సెంటర్ వరకు కార్ పార్కింగ్‌కు అనుమతించవద్దని, దీనివల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో పెయిడ్ పార్కింగ్ విధానం ప్రవేశపెట్టడం వల్ల ట్రాఫిక్ నియంత్రించవచ్చన్నారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సిటీ ప్లానర్లు, షాపుల యజమానులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమూల్యం

- సీఎం జగన్ నమ్మకాన్ని వమ్ము చేయలేదు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సేవా పురస్కారాలతో సత్కారం



గ్రామ వలంటీర్ల సత్కార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రభుత్వ పాలనను పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సీఎం, మండల ప్రజల తరపున ఎమ్మెల్యే వలంటీర్లకు వందనం అర్పించారు. తూరంగిలోని ఎన్‌సీవీ ఫంక్షన్ హాలులో గురువారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల వలంటీర్ల సత్కార సభలో ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీన తెల్లవారక ముందే లబ్ధిదారులకు ఫించన్ అందజేస్తున్నారన్నారు. ఏ కష్టమొచ్చినా, ఆపద వచ్చినా ప్రజాప్రతినిధులను కాదని ముందుగా వలంటీర్లకే చెప్పుకుంటున్నారంటే సీఎం జగన్ ముందుచూపుతో తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థే కారణమన్నారు. కొరిపల్లి వలంటీర్ పండంటిబిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని తక్షణం మంజూరు చేసిన రూ.5 లక్షలు చెక్కును అందించారన్నారు. ఎంతో అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని, నాయకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎంపీడీఓ కర్రె స్వప్న మాట్లాడుతూ ఇద్దరు వలంటీర్లకు సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న, 460 మందికి సేవామిత్ర అవార్డులు ఇవ్వడం జరుగుతోందన్నారు. సేవావజ్రగా ఎంపికైనా పలివెల ముసలయ్య (యండమూరు), వాసంశెట్టి నాగలక్ష్మి (కొరిపల్లి)కి రూ 30.వేలు నగదు, సేవారత్నకు ఎంపికైన పలివెల సతీష్ కుమార్ (అరట్లకట్ట), చీపురపల్లి ప్రశాంతి(నడకుదురు), పుణ్యమంతుల నూకరత్నం(గొర్రిపూడి), కళ్యాణి నాగమణి (వాకాడ), నల్లా భాగ్యశ్రీ (నడకుదురు)లకు రూ.20వేలు, మిగిలినవారికి రూ.10 వేలువంతున నగదు ప్రోత్సాహకం, శాలువతో సత్కరించి, సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే కన్నబాబు అందజేశారు.

పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన..

ఈ సందర్భంగా కూరాడలో రూ.30 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనానికి ఎమ్మెల్యే కన్నబాబు గురువారం ప్రారంభోత్సవం చేశారు. ఎంపీపీ ఎంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు రావుల ప్రసాద్, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యుడు బొండా చంటిబాబు, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



డాక్టర్ అమరేంద్రకుమార్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న బాలసువర్ణ

కరప: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య సేవలు(కాల్ 1962 సర్వీసెస్) ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉత్తమ సేవలందించిన వైద్యులను విజయవాడలో ఆ శాఖ సంచాలకుడు (డైరెక్టర్) డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్ సత్కరించి, ఉత్తమ సేవాపురస్కారాన్ని అందించారు. నియోజకవర్గ పరిధిలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల డాక్టర్ చాట్ల బాలసువర్ణకు ఉత్తమ సేవాపురస్కారం లభించినట్టు కరప సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ ఎస్‌జే సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఈ మేరకు డాక్టర్ బాలసువర్ణను సత్కరించి, ఉత్తమ పురస్కారాన్ని ఈఎంఆర్ఐ సంస్థ (గ్రీన్‌వెల్త్ సర్వీసెస్) సీఈఓ రామకృష్ణవర్మతో కల్సి పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ అమరేంద్రకుమార్ అందజేశారన్నారు. బాలసువర్ణను జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్, కరప సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ సురేష్‌బాబు, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు అభినందనలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం

కాకినాడ సిటీ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఆమోదం తెలిపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, జిల్లా కో ఆర్డినేటర్ దారపురెడ్డి తాతాజీరావు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడలో వారు విలేకర్లతో మాట్లాడుతూ రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ప్రొబేషన్ డిక్లేర్ అయిన ఉద్యోగులందరూ బదిలీలకు అర్హులన్నారు. జూన్ పదో తేదీ వరకు సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లా పరిధుల్లో బదిలీలతో పాటు అంతర్ జిల్లాల బదిలీలకు కూడా అవకాశం కల్పించినట్లు నిఖిలకృష్ణ తెలిపారు. జిల్లాలో రిక్వెస్ట్ చేసుకున్న ఉద్యోగులందరికీ బదిలీలకు అవకాశం కల్పించారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ కేసుల్లో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కూరాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



కూరాడలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రజా సంక్షేమంతో పాటు, అభివృద్ధి పనులు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. కూరాడలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వాన్ని స్థానిక నాయకులతో ప్రారంభించి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ముందుకు సాగారు. అర్హత ఉండీ సంక్షేమ పథకాలు మంజూరు కాకపోతే వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా కుంటిసాకులతో తప్పించుకోకుండా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నవరత్న పథకాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికి అయిదారు పథకాల ద్వారా ప్రయోజనం పొందడంతో లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కూరాడలో చాలా అభివృద్ధిచేశామని, కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని గ్రామస్తులు కోరారని, త్వరలోనే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.43 లక్షలతో పూర్తి చేసిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్ వాసంశెట్టి కొండ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల శాంతి, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, చిన్నం వెంకటేశ్వరరావు, గుత్తుల బాలాజీ, వెలుగుబంట్ల నారయ్య తదితరులు పాల్గొన్నారు.

చల్లని గాలులు.. చిరుజల్లులు

బోట్‌క్లబ్: రోహిణీ కార్తె వస్తూనే చిరుజల్లులను తీసుకు వచ్చి నగర ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. గురువారం సాయంత్రం కాకినాడ నగరంలో చల్లని గాలులు చిరు జల్లులు పడడం ఊపిరిపీల్చుకున్నారు. గత రెండు రోజులుగా భానుడు నిప్పులు కురిపిస్తూ, ఉక్కపోతకు గురిచేస్తూ ప్రజలతో ఆటలాడుకున్నాడు. ఫ్యాన్ వేసుకున్నా వేడిగాలులు వీయడంతో ఉక్కపోతకు గురై అవస్థలు పడ్డారు. గురువారం సాయంత్రం ఒక్కసారి వాతావరణంలో మార్పులు రావడంతో చిరు గాలుల తోపాటు చిరుజల్లులు పడడంతో ప్రజలు కాస్త ఉపశమించారు.

ఉత్సాహంగా సమ్మర్ క్రికెట్ టోర్నీ



వేళంగిలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న ఉప సర్పంచ్ అయ్యన్న

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ జోరుగా సాగుతోంది. గురువారం అండర్-19 విభాగంలో కూరాడ ఫ్రెండ్స్‌తో ఆడిన వేళంగి నిత్యానందపురం సెంటర్ జట్టు పరాజయం పాలైంది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా రాజేష్ (కూరాడ) నిలిచాడు. మధ్యాహ్నం జరిగిన నో ఏజ్ లిమిట్ విభాగంలో పెద్దాపురప్పాడు జట్టుపై వేములవాడ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా బన్నీ (వేములవాడ) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో వేళంగి కొత్తపేట జట్టుపై చొల్లంగి జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా అల్లం ప్రసాద్ నిలిచాడు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డులను వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ కుంచే అయ్యన్న అందజేశారు. వేళంగి గ్రాడ్యుయేట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛ జిల్లాగా నిలుపుదాం

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయం నుంచి జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణతో కలిసి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో గ్రామాల్లో పారిశుద్ధ్యాని మెరుగు పరిచి పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఒక వేళ నిర్మించి, నిరూపయోగంగా ఉంటే వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని పెంపొందించవచ్చన్నారు. వీటిపై ప్రధానంగా దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలను కోరారు. వ్యర్థ రహిత గ్రామాలుగా కృషి చేస్తే మలేరియా, టైఫాయిడ్, డెంగీ, స్వైన్‌ఫ్లూ, అతిసారం వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఆదర్శ గ్రామాలుగా తయారు చేసేందుకు, పరిశుభ్రమైన తాగునీటి వసతి కల్పించేందుకు, అందమైన ఆహ్లాదకరమైన, వ్యాధి రహిత పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ప్రధాన ఆశయంగా పని చేయాలని వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి కృషి



జాన్సన్‌ను సత్కరిస్తున్న జిల్లా పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీలకు ప్రాధాన్యం ఇస్తూనే కుల, మతాలకు అతీతంగా పథకాలు, కార్యక్రమాలు చేపడుతోందని వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఏడిద జాన్సన్ అన్నారు. గురువారం కాకినాడ డైరీఫారం సెంటర్‌లోని క్రాంతి టీవీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పాస్టర్ ఫెలోషిప్ ఎగ్జిక్యూటీవ్ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులంతా ఐక్యతతో ఉండి సోదర భావం చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాస్టర్ల సమస్యలు, సంక్షేమం తదితర విషయాలపై జిల్లా నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ డీజీ శామ్యూల్ సాగర్, గౌరవ అధ్యక్షుడిగా జోసఫ్ బెనీ, శీరం ఐజాక్, విక్టర్ దడాల, విక్టర్ శామ్యూల్, సురేంద్ర, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు దడాల జాషువా గిరి, జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

కరప కళాశాలకు అధ్యాపకుల నియామకం



కరప హైస్కూలులో ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాల

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలకు ఈ ఏడాది నుంచి పూర్తిస్థాయిలో సబ్జెక్టు అధ్యాపకులను నియమించినట్టు హెచ్‌ఎం యు.లీలామనోహర్ గురువారం తెలిపారు. గత ఏడాది బైపీసీ గ్రూపుతో ప్రారంభించగా ఈ ఏడాది నుంచి ఎంపీసీ గ్రూపు కూడా ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. అన్ని వసతులు సమకూర్చి, అనుభవజ్ఞులైన, నిష్ణాతులైన అధ్యాపకులను శాశ్వత ప్రాతిపదికన నియమించినట్టు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరానికి కరపలో అడ్మిషన్ తీసుకోవాలని హెచ్‌ఎం కోరారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కొత్తపల్లి: రమణక్కపేట – రామరాఘవపురం రోడ్డు సమీపంలోని తోటలో ఉన్న సారా బట్టీలపై సిబ్బందితో కలిసి ఎస్సై రామలింగేశ్వరరావు గురువారం దాడి చేశారు. సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, విక్రయాలు నేరమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఎవరైనా సారా తయారు చేస్తున్నా, విక్రయిస్తున్నా తమకు సమాచారం అందించాలని సూచించారు.